క్లుప్తంగా

భగవద్గీత పుస్తకాలు పంపిణీ



భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో దాత అల్లు మోహన్ విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా కార్యవర్గ సభ్యులు బాడాన రాజశేఖర్ మాట్లాడుతూ.. భగవద్గీత ప్రతి హిందువు చదవాల్సిన గ్రంథం అన్నారు. విద్యార్థి దశ నుంచే దీన్ని అధ్యయనం చేయడంవల్ల ఎన్నో విలువలతో కూడిన వ్యక్తిత్వ వికాసం కలుగుతోందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డి సూరిబాబు, సావిత్రమ్మ, తంగి రమణమూర్తి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కింజరాపు జగ్గారావు, వీహెచ్‌పీ సభ్యులు లక్ష్మీనారాయణ, భవానీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం రూరల్ : ఇచ్ఛాపురం మండలం ఈదుపురం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బోర కార్తీక్ అండర్-14 విభాగం ట్రయాథ్లన్-సిలో బంగారు పతకం సాధించాడు. గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన 38వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో పతకం దక్కించుకున్న కార్తీక్ ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు భువనేశ్వర్ కళింగ స్టేడియంలో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఆడనున్నాడు. అదే విధంగా అండర్-18 మిడిల్ రిలే పోటీల్లో బోర బేబీ కాంస్య పతకం దక్కించుకుంది. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో విజేతలతో పాటు వ్యాయామోపాధ్యాయుడు సాజన్‌ను ప్రధానోపాధ్యాయుడు బి.తమ్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



ఎస్.ఆర్.సి.పురంలో వంజరాన పాపయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

కంచిలి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన, అనారోగ్యం పాలైన వ్యక్తుల కుటుంబాలను జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ శనివారం పరామర్శించారు. ఎస్.ఆర్.సి.పురం గ్రామానికి చెందిన వంజరాన పాపయ్య, మధుపురం గ్రామానికి చెందిన డొక్కరి దండాసి కుటుంబాలతోపాటు అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ధర్మాన వీరయ్య స్వామి కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆయనను కూడా పిరియా విజయ పరామర్శించారు. పార్టీ నేతలు ఇప్పిలి కృష్ణారావు, పీఏసీఎస్ మాజీఅధ్యక్షుడు గుమ్మడి రామదాసు, వైస్ ఎంపీపీ పాలిన కామాక్షి, డొక్కరి బలరాం, డొక్కరి దాలయ్య, మెండ మురళీనాయుడు, రిషి ఉన్నారు.

ఇంజినీరింగ్ గ్రాఫిక్స్ పుస్తకావిష్కరణ

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ సహాయ ప్రొఫెసర్ రఘువీర్ రచించిన ఇంజినీరింగ్ గ్రాఫిక్స్ పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు పుస్తకాన్ని ఆవిష్కరించి దీని ప్రాధాన్యతను వివరించారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంత.. చినుకు పడితే చింత..!

- కాశీబుగ్గ శుక్రవారం సంతలో సమస్యల తిష్ట
- వర్షం పడితే అవస్థలే..
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు, కొనుగోలుదారులు



కాశీబుగ్గ సంతలో గొడుగుల కింద వ్యాపారం చేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులతో ప్రతి శుక్రవారం జరిగే పలాస-కాశీబుగ్గ వారపు సంత సమస్యలకు నిలయంగా మారింది. జిల్లాలో నలుమూలల నుంచి రైతులు వారు పండించే పంటలను అమ్ముకోవడానికి ఈ సంతకు చేరుకుంటారు. అలాగే ఇక్కడ దొరికే తాజా కూరగాయలు, ఇతర వస్తువుల కొనుగోలు చేసుకోవడానికి ఉద్దాన, తీర ప్రాంతాలతో పాటు గిరిజన గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. అయితే ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ సంత మౌలిక సదుపాయాలకు దూరంగా ఉంది. పట్టణంలోని కేటీ రోడ్డును ఆనుకొని సంతను నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఉన్న మైదానం మీదగా మరో రోడ్డు అలాగే హైస్కూల్ రోడ్డు ఉండటంతో వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా మారుతుంది. ఈ రోడ్డుల పక్కనే వ్యాపారులు గోడుగులను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే తక్కువ విస్తీర్ణం ఉన్న సంత మైదానంలో వందలాది మంది రైతులు, వ్యాపారులు ఒకే వేదికగా వ్యాపారాలు చేయడంతో పాటు కొనుగోలుదారుల తాకిడితో సంత కిక్కిరిస్తుంది. సంత మధ్యలో తోపుడు బళ్లు ఉండటం, అలాగే రోడ్డుపై కూరగాయలు, ఇతర వస్తువులు వేసి వ్యాపారం చేయడంతో నడిచేందుకు కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే చిన్న వర్షం పడిన నీరంతా సంతలోకి చేరి చిత్తడగా మారుతుంది. దీంతో వ్యాపారులతోపాటు వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిసార్లు కూరగాయలు వర్షపు నీటితో కొట్టుకుపోగా, మరికొన్ని కూరగాయలు, ఇతర వస్తువులపై బురద పడటంతో వాటిని కొనేందుకు వినియోగదారులు నిరాకరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. దీంతో వర్షాలు కురిసేటప్పుడు తాము సరిగా కూరగాయలు అమ్మలేక నష్టాలను చవిచూస్తున్నామని అవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు గొడుగే రక్ష

రైతులు పండించిన కూరగాయలు అమ్మకాలు చేయడాని సంతలే వారికి ప్రధాన వేదిక. దీంతో గిరిజన గ్రామాలు, ఉద్దాన ప్రాంతంతో పాటు బ్రహ్మణతర్లా, టెక్కలిపట్నం, నందిగాం, కోటబొమ్మాళి, నరసన్నపేట తదితర సూదూర ప్రాంతాల నుంచి రైతులు వారు పండించే పంటలను అమ్మకోవడానికి ప్రతి శుక్రవారం సంతకు వస్తారు. అయితే సంతలో సరైన సౌకర్యాలు లేక ఎండకు, వానకు రక్షణగా గోడుగులను ఏర్పాటు చేసుకుంటున్నారు. అయినప్పటికీ గొడుగుల నుండి రక్షణ పొందలేక ఇబ్బంది పడుతున్నారు.



వర్షపు నీటిలోనే కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



సంతలోకి చేరిన వర్షపు నీరు

వర్షం పడితే ఇబ్బందే



నేను ప్రతీ శుక్రవారం కోటబొమ్మాళి నుంచి కాశీబుగ్గలో జరిగే సంతకు చేరుకొని కూరగాయలు అమ్ముతాను. ఇక్కడ సరైన సదుపాయల్లేక రోడ్డు పక్కనే గొడుగు ఏర్పాటు చేసి అందులోనే అమ్మకాలు చేస్తాను. వర్షం పడితే మా ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఏం చేయాలో తెలియక ఎండకు ఎండి,వానకు తడిసి దేవుడా అంటూ ముందుకు సాకుతున్నాం.

– నెయ్యిల గున్నారావు, కూరగాయల రైతు, కోటబొమ్మాళి

సదుపాయాలు కల్పించాలి



ఎన్నో ఏళ్లగా ఇదే సంతకు వచ్చి వ్యాపారం చేస్తున్నాను. సదుపాయలు లేకపోయినా ఎన్ని కష్టాలు వచ్చినా మాకు తప్పదు కదా. ఏం చేస్తాం బాబు. సంతలో సదుపాయాలు కల్పిస్తే అందరికీ మంచిదే. నాయకులు, అధికారులు ఆలోచన చేయాలి.

– ఎస్.నాగేశ్వరరావు, కూరగాయాల వ్యాపారి, కోటబొమ్మాళి

ఆలోచిస్తే ప్రభుత్వానికి అదాయం

వ్యాపార, వాణిజ్య పరంగా ఎంతో అభివృద్ధి చెందిన పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రతి శుక్రవారం జరిగే సంతకు సుమారు 150 నుంచి 200 మంది రైతులు, ఇతర వ్యాపారులు చేరుకొని వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ఆ ఒక్కరోజే లక్షల రూపాయల వ్యాపారం జరుగుతుంది. అయితే సంత మైదానంలో ప్రభుత్వం రైతులకు, వ్యాపారులకు అనుగుణంగా రేకుల షెడ్ ఏర్పాటు చేసి ఇతర సదుపాయాలు కల్పించి వారి నుంచి కొంత సొమ్మును సంత మెయింటెనెన్స్ పేరుతో వసూళ్లు చేస్తే మున్సిపాలిటీకీ అదనంగా ఆదాయం సమకూరుతుంది. అలాగే రైతులు, వ్యాపారుల కష్టాలు తీరుతాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

నియోజక వర్గస్థాయి కబడ్డీ విజేత బాహడపల్లి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సర్పంచ్ రత్నం బాలరాజు తదితరులు

వజ్రపుకొత్తూరు: అమలపాడులో విజయదశమి సందర్భంగా డివోషనల్ గ్రూపు సౌజన్యంతో శ్రీకాకుళం కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలాస నియోజకవర్గస్థాయి ఆహ్వాన కబడ్డీ పోటీల్లో బాహడపల్లి విజేతగా నలిచింది. మొత్తం 32 జట్లు పోటీల్లో పాల్గొనగా ఫైనల్‌కు బాహడపల్లి, ఎల్.కొత్తూరు చేరాయి. ఇరుజట్ల మధ్య పోటీ ఉత్కంఠంగా సాగింది. నువ్వా నేనా అన్నట్టుగా తలపడగా చివరకు బాబడపల్లి మూడు పాయింట్ల తేడాతో విజేతగా నిలిచింది. విజేత జట్టుకు వరుసగా రూ.10 వేలు నగదు, బాహుబలి ట్రోఫీ, ద్వితీయ స్థానంలో నిలిచిన ఎల్.కొత్తూరుకు రూ.7 వేలు నగదు, షీల్డు, తృతీయ స్థానంలో ఉమ్మడిగా నిలిచిన తాళభద్ర, అమలపాడు జట్లకు చెరో రూ. 5 వేలు, షీల్డు అందజేశారు. బెస్ట్ రైడర్‌గా పవన్, బెస్ట్ డిఫెండర్‌గా కిరణ్, బెస్ట్ ఆల్ రౌండర్లుగా జి.మురళీ, డి.మురళీలను ఎంపిక చేసి వారికి నగదు, షీల్డును గ్రామ సర్పంచ్ రత్నం బాలరాజు, మాజీ సర్పంచ్ దున్న షణ్ముఖరావు, గ్రామ పెద్దలు అందజేశారు. అంతకు ముందు గ్రామానికి చెందిన సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో గెలుపొందిన హర్ష, చరణ్ టీంలకు పెద్దలు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యూత్ లీడర్ డీఆర్ డిల్లీరావు, కారాడ గిరిబాబు, దున్న పెంటారావు, డివోషనల్ గ్రూపు ప్రతినిధులు, రిఫరీలు సాగర్, లోకేశ్వరరావు, కోటి, హరి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి ఔదార్యం



హెచ్‌ఎంకు చెక్కును అందజేస్తున్న సోమేశ్వరరావు

సంతబొమ్మాళి: దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి, బృందావనం గ్రామానికి చెందిన అప్పిని సోమేశ్వరరావు లక్ష రూపాయల చెక్కును పాఠశాలకు వితరణగా శనివారం అందజేశారు. 1981-82 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన సోమేశ్వరరావు ఇటీవల డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. తాను చదివిన పాఠశాలకు ఏదైనా సహాయపడి రుణం తీర్చుకుందామనే ఆలోచనతో తన వంతుగా సహాయం అందజేశారు. లక్ష రూపాయల చెక్కును ప్రధానోపాధ్యాయులు పిట్ట గంగన్న పేరున ఇచ్చారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఆయనను అభినందించారు. ఉపాధ్యాయులు భాస్కరరావు, తిరుపతిరావు, జె.శ్రీనివాసరావు, సూర్యప్రకాష్, నాగేశ్వరరావు, శారదాంబ, లక్ష్మీనారాయణ, బి.శ్రీనివాస్, అన్నాజీ, మురళీధరరాజు, రాము, ఉమ, శ్రీధర్, విజయలక్ష్మి, లక్ష్మణమూర్తి, శ్రీనివాసరావు, దయాసాగర్, శ్రీధర్, మార్కండేయులు, సీఆర్‌పీ గిరి పాల్గొన్నారు.

నేడు కార్గో ఎయిర్‌పోర్టుపై అవగాహన కార్యక్రమం

పలాస: పలాస రైల్వే ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం ఉదయం పది గంటలకు కార్గో ఎయిర్‌పోర్టుపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్దానం రైతులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ హాజరవుతున్నారన్నారు.

ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఉపాధ్యాయుల ఆందోళన



బైక్ ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఫ్యాప్టో రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు మండల కేంద్రమైన వజ్రపుకొత్తూరులో శనివారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి వజ్రపుకొత్తూరు వరకు బైక్ ర్యాలీ చేశారు. అనంతరం వజ్రపుకొత్తూరు బస్‌స్టాండ్ వద్ద ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వెంటనే మార్చుకోవాలని, తమకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు బల్లా చిట్టిబాబు, మామిడి భుజింగరావు, హేమశంకర్, కె.వెంకటరావు, కింతల సుజాత, కె.దేవి, శిరీష, శ్రవంతి, కె.జయరాం, కె.నాగేశ్వరరావు ఉన్నారు.

ఇంటి నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలి

వజ్రపుకొత్తూరు: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా 2019 నుంచి 2024 వరకు వివిధ దశల్లో ఆగిపోయిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసిన అందరూ గృహ ప్రవేశాలు చేయాలని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరు మల్లేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన పూండిలో విలేకరులతో మాట్లాడారు. పీఎంఏవై 2.0 పథకంలో భాగంగా ఇల్లు లేని పేదలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకంలో రూ.2.50 లక్షలు ప్రభుత్వం అందిస్తుందని కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.ఒక లక్ష ఇస్తుందని అన్నారు.

ఆటో డ్రైవర్లకు చెక్కుల పంపిణీ



టెక్కలి: చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ చిరంజీవి

టెక్కలి: కూటమి ప్రభుత్వం అమలు చేసిన ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి కోరారు. శనివారం టెక్కలిలో నియోజకవర్గ స్థాయిలో ఆటో డ్రైవర్ల సేవలో పథకం చెక్కును పంపిణీ చేశారు. అంతకు మునుపు ఆటో డ్రైవర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశం నిర్వహించి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ఎంపీవో సంజీవరావు, నాయకులు బి.శేషగిరి, కె.హరివరప్రసాద్, ఎల్.ఎల్.నాయుడు, ఎం.దమయంతి, ఎం.సుందరమ్మ, బి.రమణమ్మ, పి.అజయ్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఎమ్మెల్యే బెందాళం అశోక్ స్థానిక బస్టాండ్ కూడలిలో ఆటోడ్రైవర్‌సేవ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు

పలాస: ఆటో డ్రైవర్లకు ఆర్థిక భరోసా కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఆటో డ్రైవర్ల సేవా పథకంలో భాగంగా కాశీబుగ్గ టి.కె.ఆర్ కళ్యాణ మండపం నుంచి టీడీపీ కార్యాలయం వరకు ఆటో ర్యాలీ చేపట్టారు. అనంతరం చెక్కులను అందజేశారు. నాయకులు వజ్జ బాబూరావు, పి.విఠల్, మల్లా శ్రీనివాస్, దాసరి తాతారావు, లొడగల కామేశ్వరరావు, వంకల కూర్మారావు పాల్గొన్నారు.

హామీల అమలులో సర్కార్ విఫలం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పలాస: ఎన్నికల హామీలను అమలు చేయడంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు ఆరోపించారు. కడపలో డిసెంబర్ ఆరు, ఏడు తేదీల్లో జరగనున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాసభల నిర్వహణ కోసం ప్రజలు ఆర్థికంగా తోడ్పడాలని కోరారు. రాష్ట్రంలో సూపర్‌సిక్స్ పథకాలు అంటూ ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఒక్క పింఛన్లు తప్ప మిగతావాటిని సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ఇంతవరకు ఉద్యోగాలు ఇవ్వలేకపోయారని దుయ్యబట్టారు. విశాఖ స్టీలు ప్లాంటును ప్రైవేటు పరం చేయాలని ప్రయత్నిస్తున్నారని, ప్రజల భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీకాకుళంలో థర్మల్ ప్లాంటుకు వేల ఎకరాలను ధారాదత్తం చేస్తున్నారని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజలు ఉద్యమాలు చేస్తున్నారని, అందులో భాగమే ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక ఉద్యమం అన్నారు. ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మద్దిల రామారావు, కుత్తుం దుష్యంతు, పి.కామేశ్వరరావు, ముసలయ్య, ఈశ్వరమ్మ, సుందరమ్మ, అప్పారావు ఉన్నారు.

పంటకోత ప్రయోగాలు శతశాతం పూర్తిచేయాలి

సోంపేట: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద మండలానికి కేటాయించిన పంటకోత ప్రయోగాలు గడువులోగా శతశాతం చేయాలని తహసీల్దార్ బి.అప్పలస్వామి, వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానీశంకరరావు వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి సూచించారు. పంటకోత ప్రయోగ అవగాహన కార్యక్రమాన్ని స్థానిక రెవెనూ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. పంటకోతలు చేసే విధానాన్ని మండల సహాయ గణాంకధికారి రమ్య సిబ్బందికి వివరించారు. పంటకోత ప్రయోగాలకు సంబంధించి పొలం ఎంపికను ఈ నెల 25వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి పాల్గొన్నారు.

వర్షం మిగిల్చిన ఆనవాళ్లు..!

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షంతో టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో వివిధ రంగాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. శనివారం నాటికి కూడా వరి పొలాలు నీట ముంపులోనే ఉన్నాయి. కోతకు గురైన రోడ్లు వర్షం తీవ్రతను గుర్తు చేస్తున్నాయి. అధికారులు వర్షం కారణంగా వాటిల్లిన నష్టాలను అంచనా వేసే క్రమంలో పరిశీలనలో నిమగ్నమయ్యారు.

–సాక్షి నెట్‌వర్క్



టెక్కలి:వరద ధాటికి కోతకు గురైన రోడ్డు



ఇచ్ఛాపురం రూరల్: నీటి ముంపులో ఉన్న తులసిగాం వరిపొలాలు

రోడ్డు కోతకు గురైంది..

టెక్కలి: భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీటి ధాటికి టెక్కలి-చెట్లతాండ్ర మార్గంలో కొన్ని చోట్ల రోడ్డు కోతకు గురైంది. సాయిచంద్రానగర్‌కు సమీపంలో రోడ్డు పూర్తిగా పెచ్చులూడిపోయి రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. ఇప్పటికే ఈ రోడ్డు గుంతలుగా ఏర్పడి ఇబ్బందులు పెడుతుంటే ఇప్పుడు వరద ధాటికి ఛిద్రంగా మారింది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం కనిపిస్తోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ముంపులోనే పంట పొలాలు

ఇచ్ఛాపురం రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా కురిసిన వర్షాలకు 300 ఎకరాలు నీటి ముంపునకు గురయ్యాయి. శనివారం ఉదయం నాటికి బాహుదానది, పద్మపురం గెడ్డలో నీటి ఉధృతి తగ్గుముఖంపడుతుండటంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. పంట పొలాలు ఇంకా వరద నీటిలో ఉన్నప్పటికీ రైతులు ఆందోళన చెందనవసరం లేదని వ్యవసాయ ఉప సంచాలకులు భవానీశంకర్ రైతులకు సూచించారు.

పుక్కళ్లపాలెం తీరంలో పొగురుతీత పనులు

కవిటి: వాయుగుండం కారణంగా కురిసిన భారీవర్షాలతో వచ్చిన వరదనీటి తొలగింపు (పొగురుతీత) పనులు శనివారం ప్రారంభమయ్యాయి. వర్షాల ధాటికి కపాసుకుద్ది బీలలో కొంతమేర, పుటియాదల బీలలో వరదనీటిలో పంటపొలాలు తేలియాడుతున్నాయి. కీలకమైన వరిపైరు చిరుపొట్టదశలో అధికవరదనీరు తొలగించకుంటే దిగుబడులపై ప్రభావం పడుతుందని రైతుల బృందం స్థానిక ఎమ్మెల్యే బి అశోక్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. తమ కష్టాలను తీర్చాలని వారు కోరారు. దీంతో వరదనీటిని సముద్రానికి మళ్లించేందుకు జేసీబీతో కాలువత వ్వకాలు ప్రారంభించారు.

పంట పొలాలు పరిశీలన

సోంపేట: మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి నీట మునిగిన వరి పొలాలను శనివారం పరిశీలించారు. గొల్లగండి, రుషికుద్ద, పలాసపురం, బారువపేట గ్రామాల్లోని పొలాలు పరిశీలించి శుక్రవారం కంటే నీటి ఉధృతి తగ్గిందని రైతులకు తెలిపారు. సోమవారం నాటికి పూర్తిగా ముంపు తగ్గే అవకాశం ఉందన్నారు. వరద ఉధృతి తగ్గిన వెంటనే నీటమునిగిన వరి పొలాలకు 20 కిలోల యూరియా, 15 కిలోల పోటాష్ చల్లుకోవాలని సూచించారు. చీడపీడలు వ్యాప్తి చెందితే గ్రామవ్యవసాయ సహాయకులను సంప్రదించి వారు సూచించిన మందులు పిచికారీ చేయాలన్నారు. రైతులు, గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు

సంతబొమ్మాళి: నౌపడలో ముంపు ప్రాంతాలైన ఆర్అండ్ఆర్ కాలనీ, వైఎస్సార్ కాలనీలో సహాయ చర్యలను శనివారం రెవెన్యూ, పంచాయతీ అధికారులు చేపట్టారు. వరద నీటిని మళ్లించి, బ్లీచింగ్ చల్లారు. క్షేత్రస్థాయిలో అధికారులతో తహసీల్దార్ హేమసుందరరావు మాట్లాడి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ముంపు ప్రాంతాల్లోని ప్రజలతో మాట్లాడారు.



సంతబొమ్మాళి: నౌపడ ఆర్అండ్ఆర్ కాలనీని పరిశీలిస్తున్న తహసీల్దార్ హేమసుందరరావు

పంట ముంపు గ్రామాల్లో అధికారుల పర్యటన

వజ్రపుకొత్తూరు రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన పంట పొలాలను అధికారులు శనివారం పరిశీలించారు. నగరంపల్లి, గల్లి, సీతాపురం,పెద్దబొడ్డపాడు తదితర గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఏడీ ఎం.రామారావు, ఏవో బి.ధనుంజయ పర్యటించి ముంపు పరిస్థితిని పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరద తాకిడికి మండల పరిధిలో 370 ఎకరాలు పంట ముంపునకు గురైందని.. అయితే ప్రస్తుతం 50 ఎకరాలలో మాత్రమే ముంపు కనిపిస్తుందన్నారు. మరో ఒకటి, రెండు రోజుల్లో వరి పంట పరిస్థితి కుదుట పడే అవకాశం ఉందన్నారు. అప్పటికీ పంట వరద నీటిలో ఉంటే నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. పంటను కాపాడుకోనేందుకు రైతులు ఎకరానికి 20 కేజీల పోటాష్, పది కిలోల యూరియా కలిపి వేయాలని సూచించారు.



కవిటి: పుక్కళ్లపాలెం వద్ద జేసీబీతో కాలువ తవ్వుతున్న దృశ్యం



సోంపేట: నీట మునిగిన పంట పొలాలు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



వజ్రపుకొత్తూరు రూరల్: పంట ముంపుపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏడీ రామారావు